# హలో-తాతయ్యా!

నాలుగున్నర అయింది.

ఇందిర రాలేదు.

అయిదున్నర... ఆరు.

ఇందిర ఇంకా రాలేదు.

ఇందిరతో పరిచయం అయిన ఈ రెండు నెల్ల కాలంలో ఎప్పుడూ ఇలా జరుగలేదు. అన్న రోజున అన్న సమయానికి విధిగా రావడం ఇందిరకు అలవాటు.

నాలుగున్నరకల్లా వస్తానన్న ఇందిర ఆరున్నరైనా రాలేదు. శ్యాంప్రసాద్ ఉత్సాహం పొంగిన పాలపై నీళ్లు చల్లినట్లయింది.

అతడు ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేనంత సంతోషంగా, ఉత్సాహంగా ఉన్నాడు ఆ రోజు. కారణం ఆ నాడు అతడి పుట్టినరోజు. ఇందిర సాన్నిహిత్యంలో ఆ సాయంకాలాన్ని తృప్తిగా గడపాలనుకున్నాడు. విషయం ఏమిటో ఇందిరతో చెప్పలేదు. కాని, తప్పక రావాలని మాట మాత్రం తీసుకున్నాడు. చేతిలో చెయ్యి వేయించుకుని మరీ వదిలి పెట్టాడు.

"తప్పకుండా వస్తానన్నానుకదా? నా మాటకి లేని విలువ నా చేతికుందా?" అని నవ్వుతూ చేతిలో చెయ్యి కలిపింది ఇందిర.

ఇందిర నవ్వుతుంటే నాగావళి గలగల ప్రవహించినట్లుంటుంది. ఇందిర మాట్లాడు తుంటే ఆ నది గట్టునుండే వెదురు పొదల మధ్యగా గాలి సవ్వడి చేసినట్లుంటుంది.

ఆనాటి పార్టీకి ఇందిర ఒక్కతే అతిథి. అయినా ఎన్నోరకాల తినుబండారాలు చేయించాడు శ్యాంప్రసాద్, ఇందిరకు ఇష్టం అని. అలాగని తనే ఎప్పుడో చెప్పింది. వేడివేడి జీడిపప్పు పకోడీలు చేయించాడు. సరిగ్గా నాలుగున్నరకి మొదటివాయి దిగాలని వంటవాడిని హెచ్చరించాడు.

మొదటివాయి తింటే పిల్లలు పుట్టరనేది శ్యాంప్రసాద్ అమ్మమ్మ అతడి చిన్నతనంలో వెంటనే పెట్టమని తను అల్లరిపెడ్తుంటే. బోడిగుండుకు బొటనవేలుకు ముడిపెట్ట సమర్థులు ముసలివాళ్లు, ఆ విషయం గుర్తుకొచ్చి చిన్నగా తనలో తనే నవ్వుకున్నాడు శ్యాంప్రసాద్.

ఇందిరకు పిల్లలు పుట్టకపోతే వచ్చే నష్టమేం లేదు. నిజానికి ఇందిర వంటి అతిలోక సుందరులైన ఆడపిల్లలు, ఎవడిచేతనో ఒకడిచేత మెడలో తాళి కట్టించుకొని, మామ్మూలు ఇల్లాళ్ళల్లా కాపురం చేస్తూ, పిల్లల్ని కంటూ, పాతికేళ్ళకే చప్పి దవడల్తో ముసలిరూపు పడిపోయి, భగవద్దత్తమైన అందాన్ని నాశనం చేసుకోడానికి కాదు పుట్టింది. అపురూపమైన

ఆ దివ్యశోభల్ని, సోయగాల్ని జీవితాంతం కాపాడుకుంటూ, తనవంటి రసపిపాసుల కనుల పండువుగా పది కాలాలపాటు మనడానికీ, తను సృష్టించిన ఆ అందాన్ని చూసి ఆ బ్రహ్మదేవుడు కూడా మురిసి ముగ్ధుడై గర్వపడ్డానికే.

శ్యాంప్రసాద్‌కు ఇందిరతో పరిచయమే తమాషాగా అయింది. ఒక రోజు ఉదయం ఏదో పనిమీద పట్నం వెళ్ళి తిరిగి వస్తూంటే నాలుగు రోడ్ల కూడలి వద్ద ఒక పెద్ద గుంపు ఎదురయింది. దేనికో దానికి సమ్మెలు, ఊరేగింపులు లేవదియ్యడం, మందిలో ఉద్రేకం పెరగడం, మాటపై మాట ముదిరి, దెబ్బకి దెబ్బగా పరిస్థితి మారేసరాకి పోలీసులు ప్రత్యక్షమై హెచ్చరికలు, లాఠీ ఛీర్జీలు, భాష్పవాయు ప్రయోగాలు, ఇంకా పరిస్థితి అదుపులోకి రాకుంటే కాల్పులు రమారమి ప్రతిరోజు పట్నంలో ఏదో ఒక వంక జరుగుతుండే సంగతులే!

ఆ రోజు డ్రైవరు రాలేదని తనే స్వయంగా కారు నడుపుకొంటూ బైలుదేరాడు శ్యాంప్రసాద్. ఒకసారి ఆ దొమ్మీలో దూరితే మళ్లా బైటపడ్డం అంత సులువైన పని కాదు. అనవసరంగా కొరివితో తల గోక్కున్నట్లు లేనిపోని గొడవల్లో ఇరుక్కోడం, ఆపైన ఎటునుండి ఏది జరిగినా బాధపడ్డం ఎందుకని కారుని వెనక్కి తిప్పి, కాస్త చుట్టుదారైనా స్టేషను మీదుగా పోయి పైడిపేట చేరుకోవాలనుకున్నాడు. అలా ఒక నిర్ణయానికి వచ్చి కారుని వెనక్కి త్రిప్పబోతుంటే, ఎదురుగ్గా ఉన్న జనసమూహంలో ఏదో కలకలం మొదలయింది. అప్పుడే పోలీసులు వచ్చి వాలారా?' అని తల కొంచెం పక్కకి చూస్తే అటువంటిదేమీ లేదు. ఎవరో ఒకమ్మాయి అక్కడ నిలచి ఉన్న బస్సు టాపు మీద కెక్కి ఉద్రేకంగా ఏదో మాట్లాడుతోంది.

ఆమె అలా ఉద్రేకంగా చుట్టూ ఉన్నవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న విషయమేమిటో మందికి, బైట ఉన్న శ్యాంప్రసాద్‌కి వినిపించలేదు. ఆ పిల్ల మాటలు వినిపించకపోయినా ఆమె రూపురేఖలు అతన్ని బాగా ఆకట్టుకొన్నాయి. శీతాకాలపు ఆ చిరు ఎండలో బంగారు పొడిని వెన్నలో రంగరించి చేసిన పసిడి బొమ్మలా ఉంది ఆ అమ్మాయి. గాలికి ఇటు అటు ఎగురుతున్న ముంగురుల మధ్య అప్పుడే ఉదయిస్తున్న చంద్రబింబంలా ఉంది ఆమె ముఖం.

అట్టే వయసులేని ఒక ఆడపిల్ల మంది మధ్య నిలబడి ధైర్యంగా అలా మాట్లాడు తుంటే పిరికివాడిలా పక్కదారంట తను తప్పుకుపోడం చిన్నతనంగా అనిపించింది శ్యాంప్రసాద్‌కి. కారుని అక్కడే ఆపి జనంలోకి చొచ్చుకు వెళ్లి అసలు సంగతేమిటో కనుక్కోవాలనుకున్నాడు.

ఆ పిల్ల నిలబడి ఉన్న బస్సు పైడిపేట బస్సు. పట్నానికి పైడిపేటకి మధ్య తిరిగే బస్సు అది ఒక్కటే. ఆ బస్సే రోజుకి రెండు ట్రిప్పులు వేస్తుంది. ఉదయం ఒకటి. సాయంకాలం ఒకటి. చాలాకాలం ఆ బస్సు కూడా ఉండేది కాదు. ఆ గ్రామస్తులు ఎన్నో మహజర్లు పంపుకోగా ఒక ఎమ్మెల్యేగారి చలవవల్ల ఆ బస్సు రూటు పడింది.

ఉదయం ట్రిప్పులో పైడిపేట నుంచి పాలు, కూరగాయలు పట్నంలో అమ్ముకోడానికి తీసుకుపోతుంటారు ఆ గ్రామంవాళ్లు. సాయంకాలానికి తమ పనులు ముగించుకొని మళ్లా అదే బస్సులో యిళ్లకు చేర్తారు. పైడిపేటలో ఒక ఎలిమెంటరీ స్కూలు, చిన్న ఆసుపత్రి వున్నాయి. అక్కడి పిల్లలు హైస్కూల్లో చదువుకోవాలన్నా, అక్కడ కుదరని రోగాలకి పట్నంలో గల పెద్దాసుపత్రిలోంచి మందులు తెచ్చుకోవా లన్నా వాళ్లకి ఆ బస్సే ఆధారం. ఒకవిధంగా చెప్పాలంటే ఆ బస్సు పైడిపేట జనావళికి జీవనాడి వంటిది. ఒక రోజు ఏ కారణంగానైనా అది రాకపోతే ఆనాడు ఆ గ్రామస్తుల దినచర్య అస్తవ్యస్తంగా తయారవుతుంది.

శ్యాంప్రసాద్ మందిని తప్పించుకుంటూ ముందుకి పోయి కనుక్కుంటే ఆ గలాభాకి గల కారణం బైటపడింది. ఆ రోజున పోలీసువారు ఎవరో ట్రక్కు డ్రైవర్ని కొట్టారని "బంద్" చేస్తున్నారట. పైడిపేట బస్సువాళ్లకి విషయం తెలియక మామూలుగా ఉదయం ట్రిప్పు వేసుకు బైలుదేరారు. అక్కడికి బస్సు స్టాండ్ అరమైలు లోపు. "ఎలాగా బైలుదేరేం కాబట్టి స్టాండుదాకా పోనీండి" అంటారు వాళ్లు, బస్సుని అటకాయించిన వాళ్లు ఒక్క అంగుళమైనా కదలనిచ్చేది లేదంటారు.

మాటకి మాట తగిలి, మందిలో ఉద్రేకం పెరిగి బస్సుని తగలబెట్టడానికి సిద్ధపడ్డారు మూక. బస్సులో వున్న జనాన్ని తట్టా బుట్టా పట్టుకొని దిగిపొమ్మని హెచ్చరించారు. వాళ్లు కంగారుగా ఆపని చెయ్యబోతుంటే అదే బస్సులో ప్రయాణిస్తున్న ఆ అమ్మాయి "దిగకండి.... బస్సులోంచి ఒక్క మనిసి కూడా దిగకండి... బస్సుని ఎలా కాలుస్తారో చూద్దాం" అంటూ వాళ్లని వారించింది. అప్పటికే దిగిపోయిన వాళ్లని తిరిగి ఎక్కిపొమ్మని కోరింది. అంతా ఈ చిన్నపిల్ల మాట వినడమా మానడమా అని సందేహిస్తుంటే బస్సు టాపుమీద ఎక్కి వారిని ఉత్సాహపరిచింది, ఉద్రేకపరిచింది.

"ఈ బస్సు మీ ఊరికి ప్రాణం, మీ జీవనాధారం. మీ ఊరికి ఈ బస్సు రూటు పడనప్పుడు మీరెన్నెన్ని అగచాట్లు పడేవారో గుర్తుకు తెచ్చుకోండి. యిప్పుడు ఎవరో పది మంది మూర్ఖుల తెలివి లేమికి మరి ఈ బస్సుని ఆహుతి చేస్తే మీకు తప్ప యింకెవరికీ పట్టని యీ రూటులో బస్సు మళ్లీ తిరగడానికి ఎంతకాలం పడ్తుందో ఎవరు చెప్పగలరు? అంతవరకు మీ వ్యాపారాలేంగాను? మీ పిల్లల చదువులు, మీ ముసలివాళ్ల అనారోగ్యాలు, మీ ఆడవాళ్ల పురుడు పుణ్యాలు, ఇవన్నీ గడుపుకు రావ డానికి మార్గం ఏమిటి? ఎవరో నలుగురు కుర్రకుంకలు చేరి 'ఈ బస్సుకి నిప్పుపెడ్తాం దిగిపోండి' అనగానే బుద్ధిమంతుల్లా తట్టా బుట్టా పట్టుకుని దిగిపోతున్నారు... పంట కాలవల దగ్గర మళ్ల దగ్గర... చిన్న తగువు వచ్చినా దొమ్మీకి దిగి తలలు పగల గొట్టుకొంటారే... ఆ పౌరుషం... ఆ ధైర్యం ఇప్పుడేమయింది?...."

ఆవేశంగా ఆ పిల్ల అలా మాట్లాడుకుపోతుండగానే, అక్కడికి పోలీసులు రావడం మూకని చెదరగొట్టడం.... ఆ బస్సు సురక్షితంగా గమ్యస్థానం చేరడం ఒకదాని వెనుక ఒకటిగా జరిగిపోయింది.

శ్యాంప్రసాద్ స్వస్థలం కూడా పైడిపేటే. అక్కడ అతడికి పొలాలు, తోటలు... తాతల నాటి ఒక పెద్ద మేడ.... దానిచుట్టు అందమైన తోట ఉన్నాయి. ఆ పట్నానికి పాతిక మైళ్ల దూరంలో నాగావళి నది ఒడ్డున వెలసిన చిన్న గ్రామం పైడిపేట. ఊరంతా కలిపి మూడు వందల గడపకి లోపు. అదైనా ఒక పొందిక అన్నది లేక నదికి ఇటు కొంత, అటు కొంతగా ఉంది. ఆ రెండు కొసల్ని కలుపుతూ అక్కడొక వంతెన అంటూ లేకపోతే అదొక ఊరు, ఇదొక ఊరు అని చెప్పుకోవచ్చు. శ్యాంప్రసాద్ తాతగారి హయాంలో వారికి తెల్లదొరల దగ్గర గల పలుకుబడిని వినియోగించి ఆ వంతెన నిర్మాణం జరిగేలా చూశారు. వారి ఇల్లు, తోట నదికి ఈ వంక ఉన్నా పొలాలు ఆ వైపు ఉన్నాయి. వర్షాకాలంలో నదిలో నీరు ఎక్కువగా ఉండే సమయాల్లో పాలేర్లకీ, నౌకర్లకీ ఇటు అటు తిరగడం కష్టంగా ఉండేది. వారి పేరు చెప్పుకొని ఈ నాటికీ గ్రామ ప్రజలు ఆ వంతెన ఉపయోగించుకుంటున్నారు.

ఊరుపేరు పైడిపేటే కాని అక్కడ విరివిగా కన్పించేవి పెంట కుప్పలు... చెత్త.. చెదారం.... నదికి యిటుప్రక్క ఉన్న శ్యాంప్రసాద్ బంగళా, పువ్వుల తోట ఆ ఊరికల్లా నదరుగా కనిపించేవి ఆ పరిసరాలే! కాస్త పరిశుభ్రమైన గాలి, మంచి వాతావరణం కావాలనుకొనేవారు సాయంకాలం పూట వంతెన దాటి షికారుగా ఇటువైపు వస్తూంటారు.

ఒక రోజున నలుగురు ఆడపిల్లలు గలగల కబుర్లు చెప్పుకొంటూ, కిలకిల నవ్వుకొంటూ తోట ముందుకొచ్చి నిలచారు. ఆడపిల్లల అలికిడి విని శ్యాంప్రసాద్ మేడపై కిటికీలోంచి "ఎవరా?..." అని తొంగిచూశాడు. ఆ నలుగురిలో ఒక అమ్మాయి ముఖం ఎక్కడో చూసినట్లు పరిచయమైందిగా అనిపించింది. ఆ పిల్లలు గేటు దగ్గర ఉండే దర్వాన్‌ను ఏమో అడుగుతున్నారు. బహుశా "బాబుగారు ఇంట్లో వున్నారా?" అని అడిగి వుంటారు. దర్వాన్ మేడ వైపు చూపిస్తూ "ఉన్నారు" అన్నట్లు తల ఊపాడు.

"రండర్రా పోదాం" అంటూ అంతా వెనుతిరగబోతూంటే ఆ పిల్ల, "ఆయన ఎక్కడో మేడ మీద ఉంటే వుండనీండి. మనకేం? మనం తోట చూడ్డానికి వచ్చాం కాని మేడ కాదు కదా!' యింత దూరం వచ్చి ఊరకే తిరిగి పోవడం ఎందుకు?" అంటూ వాళ్లని లోపలికి లాగింది.

"పువ్వులు, కాయలు కొయ్యకుండా తోట చూసిపొండి" అన్నాడు అక్కడే మొక్కలకి పాదులు చేస్తున్న తోటమాలి వెంకయ్య.

కొంతసేపు తోటలో తిరిగి ఆ పిల్లలు ఎలా వచ్చారో అలాగే సరదాగా కబుర్లు చెప్పుకొంటూ తిరిగి వెళ్లిపోయారు. ఆ వెనుక కూడా రెండు, మూడు రోజులు వాళ్లు అదే సమయానికి రావడం, ఒక గంటసేపు తోటలో తిరిగి వెళ్లిపోతుండడం శ్యాం ప్రసాద్ గమనించాడు.

రెండు, మూడు రోజులుగా చాటు నుండి వారి ఆటపాటలు తిలకించిన శ్యాంప్రసాద్ నాలుగోనాడు కావాలనే వారు తోటలోంచి తిరిగి వచ్చేసరికి ఇంటి ముందున్న లాన్‌లో కుర్చీ వేయించుకొని కూర్చున్నాడు. అక్కడ అతడిని చూసిందే తడవుగ ఆ పిల్లలు తమని వెనుక నుంచి ఎవరో తరుముకు వస్తున్నట్లు త్వరత్వరగా అడుగులు వేస్తూ గేటు దాటి వీధిలో పడ్డారు.

వారిలో ఒక అమ్మాయి మాత్రం శ్యాంప్రసాద్ కూర్చున్నవైపు రెండు అడుగులు వేసి, "మీ తోట చాలా బాగుందండీ! మీ అనుజ్ఞ తీసుకోకుండా జొరపడ్డాం, క్షమించాలి" అంది రెండు చేతులు జోడిస్తూ.

"ఇందులో క్షమించడానికేముంది? అందంలో ఉండే తీక్షణతే అది. అది ఎక్కడ ఏ రూపాన ఉన్నా, మనసుని ఆకర్షించి తన వైపు లాక్కొంటుంది" అన్నాడు ఆ పిల్లని పరిశీలనగా చూస్తూ శ్యాంప్రసాద్.

"మీకు మా తోట బాగుందనిపిస్తే రోజూ వచ్చి కొంతసేపు గడిపి వెళ్తుండండి. నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ప్రోత్సాహంగా.

"చాలా సంతోషమండీ! మళ్లీ రేపు వస్తాం" అని చెప్పి ఆ పిల్ల వెళ్లిపోయింది. రోడ్డుపై తన కోసం కాచుకొని ఉన్న మిగిలిన అమ్మాయిల్ని కలుసుకోడానికి.

ఆపిల్ల ముఖం మొదటిసారి చూడగానే ఎందుకు పరిచియమైన ముఖంలా అనిపించిందో శ్యామ్‌ప్రసాద్‌కి తెలియవచ్చింది. ఆనాడు బస్సు టాపు మీద నిల్చి గ్రామస్తులకి ధైర్యాన్ని, కర్తవ్యాన్ని నూరిపోసిన పిల్ల ఈ అమ్మాయే!

ఆ అమ్మాయ పేరు ఇందిర. మరునాడు ఇందిర ఒక్కతే వచ్చింది. సాయంకాలం ఆమె రావడానికి పూర్వమే తోటలో కుర్చీ వేయించుకొని పేపరు చూస్తూ కూర్చున్నాడు శ్యాంప్రసాద్.

"మిగిలినవాళ్లంతా ఏరీ?" అన్నాడు ఇందిర ఒంటరిగా రావడం చూసి.

"మీరుంటారని రాలేదు."

""ఏం? నేనుంటేనేం?... కొరుక్కు తింటానా?" నవ్వుతూ ప్రశ్నించాడు అతడు.

"ఏమో! చూడగా అలాగే ఉంది.... లేకపోతే వాళ్లంతా ఎందుకలా భయపడి పోతారు?" అంది ఇందిర.

అప్పటి ఇందిర రూపం... ఆ నవ్వూ చూస్తుంటే నిజంగా ఆ పిల్లని వున్నపాటున చేతిలోకి తీసుకొని కొరుక్కు తినేయాలనే అనిపించింది శ్యాంప్రసాద్‌కి. అంతటి అందం, అందాన్ని మించిన ఆకర్షణా ఉంది ఆ పిల్లలో. ప్రతి కదలికలో ఏదో ప్రత్యేకత తొంగిచూస్తుంటే, ఏపాటి సంకోచం లేకుండా చకచకా అలా మాట్లాడుతున్న ఆ పిల్ల వంక ముచ్చటగా చూసాడు.

"రండి... మీకేం భయంలేదు. హామీ యిస్తున్నాను. నేనూ మనిషినే" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

అలా మొదలయింది వారి పరిచయం. అటు తరువాత కూడా ఇందిర తరచు వస్తుండేది. సాధారణంగా ఇద్దరూ ఇంటి ముందున్న లాన్‌లోనో, తోటలో మామిడి చెట్ల నీడలోనో కూర్చుని కబుర్లు చెప్పుకొనేవారు. ఒక్కొక్కసారి నది గట్టంట కొంచెం దూరం నడిచి వస్తూండేవారు.

ఇందిరతో పరిచయం ఏర్పడ్డాక, అది స్నేహంగా మారాక ఆ యిల్లు, తోట, పరిసరాలు ముందెన్నడూ లేనంత అందంగా, ఆహ్లాదంగా కనిపించసాగాయి శ్యాంప్రసాద్‌కి.

"తాతలనాటి పురాతన గృహాన్ని బాగుచేయించి తను అక్కడ వుండదలచాడని శ్యాంప్రసాద్ చెప్పిననాడు, అతడితోటి, అతడి జీవిత విధానాలతోటి పరిచయం ఉన్న మిత్రులెవరూ నమ్మలేదు. చివరికి అది పరిహాసానికి అన్నమాట కాదని, వాస్తవమనీ తెలిసాక, "మేం పందెం వేస్తాం, ఆర్నెల్లు తిరిగే సరికల్లా ఆయనగారు తోక ముడిచి తిరిగి రాకపోతే చూడండి" అన్నారు కొందరు.

"బహుశ పట్నవాసపు ఆనందాలతో విసిగి అక్కడ పల్లెలో కొత్త రుచులు చవి చూడాలనే ఉబలాటంలో బైలుదేరుతున్నావేమో? కథల్లో, సినిమాల్లో చిత్రించేటట్లు పచ్చపచ్చని పంటచేలు, వయసులో ఉండే వయ్యారి భామలు అక్కడ నీకు కన్పించరు. బైట కాలు పెడితే చాలు, పేడ కుప్పలు, పెంట పోగులు.... మురికి రాజకీయాలు... ఇవే దర్శమనిస్తాయి" అంటూ హెచ్చరించాడు మిత్రుడు.

ఇందిర అతడి జీవితంలో అడుగు పెట్టకుండా ఉంటే వారి జోస్యాలు నిజమై ఉండేవి. ఇల్లు, తోట, కొత్త ప్రదేశం, కొత్త ఉత్సాహం. మొదట కొంతకాలం వరకూ రోజులు. బాగానే దొర్లుకుపోయాయి శ్యాంప్రసాద్‌కి. ఊరికి వెనుకగా కాటుక రాసిపోసినట్లుండే నల్లని కొండ, పైనున్న ఆకాశం కరగి పారుతున్నట్లుండే నాగావళీ నదీజలాలు, ఇటు అటు పంట పొలాలు, పళ్ల తోటలు, ఇటువంటి సుందర ప్రదేశాల్లో తిండీ, నిద్రా లేకపోయినా మనిషి తృప్తిగా బ్రతికేయవచ్చు అనుకున్నాడు.

ఎప్పుడూ చెంత ఉండే మనిషిలాగే, ఎల్లవేళలా ఎదురుగా ఉండే ప్రకృతి, అది ఎంత మనోహరమైనదైనా, కొంతకాలానికి జీవితంలో ఒక భాగగా మారిపోయి, దాని ప్రత్యేకతను కోల్పోతుంది. అది అలాగ ఉండడమే సహజం, సత్యం అన్న భావం ఏర్పడుతుంది.

జీవిత గమనంలో అడుగడుక్కీ మార్పు, నూతనత్వం కాంక్షించే శ్యాంప్రసాద్ రసిక హృదయాన్ని ఆ జడ ప్రకృతి తన ఆకర్షణతో అట్టే కాలం కట్టివేసి ఉంచలేక పోయింది. బ్రతుకులో ఒక విధమైన స్తబ్ధత ఏర్పడి ఏం చెయ్యాలో పాలుపోని స్థితిలో అతడు కొట్టుమిట్టాడుతుండగా, ఇందిర అతడి ఇంటి తోటలో వసంత సమీరంలా ప్రవేశించి అతడి జీవిత రథానికి చలనం కలిగించింది.

శ్యాంప్రసాద్ అస్ఖలిత బ్రహ్మచారి కాదు. తాత, తండ్రుల ధర్మమా అని ఎంత ఖర్చు పెట్టినా తరగనంత ఆస్తి ఉంది. డబ్బుని ఉపయోగించుకొని ఏయే అందాలు, ఆనందాలు అనుభవించవచ్చునో తెలుసుకోగల మనసు ఉంది. భార్య బ్రతికుండగానే అతడికి ఇతరత్రా ఎందరో ఆడవాళ్లతో పరిచయాలు ఉండేవి. ఆ కాస్త అడ్డు తీరిపోగానే ఎందరో ఆడవాళ్లు, అన్ని వయస్సుల్లో వాళ్లు, వెంటపడ్డారు, 'నిన్ను ప్రేమిస్తున్నాం" అంటూ. వాళ్లు ప్రేమించేది తనని కాదనీ, తన డబ్బుననీ అతడికి తెలుసు. అందుకే వాళ్లు కోరేది వాళ్లకిచ్చి తనక్కావలసింది తను పొందుతూ తృప్తి పడ్డాడు.

కాని ఇందిర సమక్షంలో అతడు పొందే తృప్తి, ఆనందం, తన్మయత అంతకు పూర్వం ఏ ఆడదాని దగ్గరా అతడు పొందలేదు. అతడికి ఈ అనుభవం కొత్తది. ఈ ఆకర్షణ విలక్షణమైనది.

ఇందిర కోసం అతడు ఏమైనా చెయ్యగలడు. ఎంత సొమ్మయినా ఖర్చు పెట్టగలడు. కాని తను అర్పించే ఉపహారం అందుకోడానికి ఆమె సిద్ధంగా ఉందా లేదా అన్నదే అతని జిజ్ఞాస. అది తీర్చుకోడానికి అనువైన సమయం ఒకటి ఏర్పడింది. కాని తన పిరికితనం వల్ల అతడే స్వయంగా దానిని జారవిడుచుకొన్నాడు.

ఇందిరతో పరిచయం కాకపూర్వం శ్యాంప్రసాద్‌కి పుస్తకాలంటే పెద్ద యిష్టం లేదు. ఇందిరకు పుస్తకాలంటే ప్రాణం అని తెలిసాక పక్షం తిరక్కుండా శ్యాంప్రసాద్ యింట ఒకమాదిరి లైబ్రరీ తయారయింది. నెల నాటికి అది బాగా పెద్దదయింది. చదివినంతసేపు అక్కడ కూర్చుని చదువుకొని యింటికి పోయేటప్పుడు ఇన్నిన్ని పుస్తకాలు పట్టుకుపోయేది ఇందిర.

"అవన్నీ చదవడానికే" అనేవాడు శ్యాంప్రసాద్ ఛలోక్తిగా.

"కాదు.... కూరొండుకు తినడానికి" అనేది ఇందిర.

స్వతఃసిద్ధంగా పుస్తకాలు చదివే అలవాటులేని శ్యాంప్రసాద్ ఇందిర కోసం పుస్తకాలు చదవడం అలవాటు చేసుకొన్నాడు. తాము చదివిన పుస్తకాల్లో కథల గురించి, ఆయా పాత్రల ప్రత్యేక మనస్తత్వాల గురించి, ఇంకా రచయిత తన రచన ద్వారా వివిధ విషయాలపై వెలిబుచ్చిన అభిప్రాయాల గురించి యిద్దరూ కూర్చుని గంటల తరబడి మాట్లాడుకొనేవారు. అలా మాట్లాడుకొంటున్నప్పుడు ఇందిరకు విషయం ముఖ్యం. అయితే అతనికి ఇందిర సామీప్యం ముఖ్యంగా తోచేది.

వాళ్లు ఇంటి నుండి బైలుదేరబోయేసరికి ఆకాశం మేఘాల మేలి ముసుగు క్రింద ఘోషా స్త్రీలాగ దాగి ఉంది

"ఇప్పుడు బైలుదేరుతున్నారు. వర్షం వచ్చేలా ఉంది. తడుస్తారేమో" అంటూ హెచ్చరించాడు రంగయ్య. అయేందుకు రంగయ్య ఇంటి నౌకరే అయినా అయిదారు దశలుగా ఆ ఇంటిని అంటిపెట్టుకొని ఉన్న కారణాన అతడి మాటకి ఇంట్లో కొంత

విలువ ఇస్తారు. కాని, ఆ రోజు రంగయ్య హితోక్తి శ్యాంప్రసాద్ వినిపించుకోలేదు. ఇందిరతో ప్రశాంతంగా బైట తిరగడానికి ఏర్పడిన ఆ అవకాశాన్ని వానకి తడుస్తాను, అన్న భయంతో వదులుకోదల్చలేదు.

"ఫరవాలేదు రంగయ్యా! ఈ వర్షం ఇప్పుడప్పుడే వచ్చి చచ్చిందా, ఉదయం నుంచీ ఇలాగే ఉంది ఆకాశం. త్వరగా వచ్చేస్తాములే" అన్నాడు.

రంగయ్య అనుమానించినట్లే వాళ్ళు ఇల్లు దాటిన కొంచెం సేపటికే వర్షం మొదలయింది. చూస్తుండగానే అది పెద్దదయింది. అరగంట పాటు ఏకధాటిగా కురిసి అప్పుడు తెరిపిచ్చింది.

వర్షం మొదలవగానే ఇంటి ముఖం పట్టినా, శ్యాంప్రసాద్, ఇందిరా ఇల్లు చేరేసరికి బాగా తడిసిపోయారు. బైట కనుచీకటి పడింది. కాని ఇంట్లో దీపాల వెలుగుతో పట్టపగల్లా ఉంది. ఆ వెలుగులో తడిబట్టలతో అంతదగ్గరగా నిలిచిన ఇందిర అందాన్ని చూస్తుంటే శ్యాంప్రసాద్ మనసు కళ్ళెం తెగిన గుర్రం అయింది. ఎంత ప్రయత్నించినా ఆమె నుండి దృష్టి తిప్పుకోలేకపోయాడు. ఆ సమయంలో ఎదురుగా రంగయ్య లేకపోతే, అతడు తననే పరీక్షగా చూస్తున్నాడు, అన్న జ్ఞానమే లేకపోతే ఏం చేసి ఉండేవాడో? తనని తాను అదుపులో పెట్టుకొని, "ఆ పక్క గదిలో హీటర్ ఉంది. వెళ్లి తల, బట్టలు ఆరబెట్టుకుని రా" అన్నాడు.

వర్షంలో తడవడం మూలంగా తెల్లవారేసరికి రొంప, జ్వరం పట్టుకుంది అతడికి.

"వెళ్లవద్దంటే విన్నారు కాదు! ఇప్పుడేమయిందో చూడండి" అంటూ కంగారు పడ్డాడు రంగయ్య. డాక్టరు వచ్చి మందిచ్చి "ఫరవాలేదు. రేపటికి తగ్గిపోతుంది" అన్నాడు.

అలవాటుగా సాయంకాలం వచ్చిన ఇందిర అతడు పడకెయ్యడం చూసి "వెనక్కి వెళ్లిపోదాం అంటే విన్నారు కాదు. చూసారా... ఏమయిందో" అంది.

"అదంతా రంగయ్య చాదస్తం. ఆపాటి వర్షంలో తడుస్తే ఏమవుతుంది?"

"ఇంకేం రావాలి? రొంప, జ్వరం, లంఖణాలు...."

"అందువల్లే జ్వరం వచ్చిందన్న మాటేమిటి? నువ్వు మాత్రం తడవలేదూ! నీ కొచ్చిందా?"

"మీ అంత సుకుమారంగా నేను పెరగలేదుగా... అయినా మా వంటి సంసార్ల దగ్గరకొస్తే అదేం సుఖపడ్తుంది? మీలాంటి డబ్బున్నవాళ్లని వరిస్తే రాజభోగాలు అందుకోవచ్చు" అంది మంచం చుట్టూ ఉన్న మందులు, మాకులు సరంజామా చూస్తూ.

విషయాన్ని మార్చాలనే అభిప్రాయంతో, "ఇందిరా చిన్న పని చేసి పెడ్తావూ" అన్నాడు శ్యాంప్రసాద్.

"చెప్పండి... నా కోసం మీరిన్ని పెద్ద పనులు చేస్తుంటే మీ కోసం ఆపాటి చిన్నపని చెయ్యనా... మరీ అంత కృతఘ్నురాలిని అనుకొంటున్నారా?" అంది నవ్వుతూ.

"అబ్బే... అందుకోసం అనలేదు. కూర్చున్న దానివి లేవాలి కదాని.. అదిగో ఆ అల్మారాలో అమృతాంజనం డబ్బా వుంటుంది...."

ఇందిర లేచివెళ్లి అమృతాంజనం డబ్బా తీసుకు వచ్చేసరికి శ్యాంప్రసాద్ కళ్లు మూసుకొని కణతల మీద రాసుకొంటున్నాడు. క్షణకాలం అతడి వంక చూసి "చెయ్యి తియ్యండి. నే రాస్తాను."

"నీకెందుకు శ్రమ... నే రాసుకుంటాలే. లేకపోతే రంగయ్యని పిలువు" అన్నాడు శ్యాంప్రసాద్.

"రోగికి సేవ చేస్తే పుణ్యమేటలెండి. ఎందుకైనా పనికి వస్తుంది ఆ పాటి పుణ్యం చేతిలో ఉంటే" అంది ఇందిర అతడి చేతిని తొలగించి నుదుటిపై అమృతాంజనం రాస్తూ.

ఆ స్పర్శ ఏదో అలౌకికానందాన్ని అతడి శరీరంలోని అణువణువునా ప్రసారం చేసింది. మూసిన కనురెప్పల కింద ఎన్నెన్నో సుందర దృశ్యాలు... మధుర కావ్యాలు అలలు అలలుగా, కలలు కలలుగా కదిలిపోయాయి. ఇందిరా తనూ కలసి పంచుకొనే ఆ జీవితంలో, అలా అతను యింకెంతసేపు గడిపి వుండేవాడో? "కాస్త తగ్గినట్లుందా?" అన్న ఇందిర ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు.

మంచం మీద అతడికి తగిలీ తగలనంత ఎడంగా కూర్చుని కొద్దిగా ముందుకి వంగి నుదుటిపై అమృతాంజనం రాస్తున్న ఇందిర అప్పటి రూపం, ఆ కూర్చున్న తీరు చూస్తుంటే వెంటనే ఆపళంగా ఆ పిల్లని మీదికి లాక్కొని ఆ అందాల బొమ్మని తన చేతుల్లో ఖైదీగా చెయ్యాలనీ, ఆ అందంలోంచి ఆనందాన్ని పండించుకొని తృప్తి తీరా అనుభవించాలని అతడి మనసు ఊరకే వెంపరలాడి పోయింది... కాని ఆ పిల్ల మతమేమిటో, మనసేమిటో తెలుసుకోకుండా తొందరపడితే మొదటికే మోసం రావచ్చని బుద్ధి హెచ్చరించింది. మనసు ఎంతగా రెచ్చకొడ్తున్నా బుద్ధి సలహాని పాటించి తన్ను తాను అదుపులో పెట్టుకొన్నాడు శ్యాంప్రసాద్.

మరికాస్తసేపు కూర్చుని ఆ మాటా ఈ మాటా మాట్లాడి యింటికి వెళ్లిపోయింది ఇందిర. పిరికితనంతో అంత మంచి అవకాశాన్ని జారవిడుచుకొన్న శ్యాంప్రసాద్‌ని అతడి మనసు ఆ రాత్రంతా, ఆ వెనుక చాలా రోజుల వరకు తలవాచేలా చివాట్లు పెట్టింది.

శ్యాంప్రసాద్ ఆలోచనల అల్లిక యింకా సాగుతూనే ఉంది.

సంధ్య కడుపులోంచి రాత్రి బైటకొచ్చింది.

చంద్రుణ్ణి మంచుపొర కప్పేసింది.

నదిమీంచి చల్లగాలి రేగింది.

"బాబూ! మంచు పడుతున్నది, లోపలికి వచ్చి కూర్చోండి" అన్నాడు రంగయ్య.

శ్యాంప్రసాద్ ఆఖరిసారిగా గేటు వైపు దృష్టి సారించి. ఇంక ఆ రోజుకి ఇందిర రాదని నిర్ధారించుకొని ఇంట్లోకి నడిచాడు. డైనింగ్ టేబిల్ పైన మూతలు ఉంచిన పదార్థాలు, కప్పులు సాసర్లు ఆనాడు రావలసిన ఒకే ఒక అతిథి రాలేదనీ, జరుగవలసిన పార్టీ జరుగలేదనీ ఎత్తి చూపుతున్నాయి. ఒక్కసారి బాధగా వాటి వంక చూసి, "రంగయ్యా! ఈ రోజు ఒంట్లో సరిగా లేదు. రాత్రికి భోజనం చెయ్యనని వంటవాడితో చెప్పు. కాస్తసేపు విశ్రాంతి తీసుకొంటాను. నన్ను దేనికీ పిలవకండి" అంటూ తన గదిలోకి వెళ్లిపోయి తలుపు వేసుకొన్నాడు.

ఉదయం నుంచి అంతవరకు ఎంతో ఉత్సాహంగా సంతోషంగా ఉన్న అయ్యగారికి అంతలోనే ఒంట్లో ఎందుకు బాగులేకుండా పోయిందో రంగయ్యకి తెలుసు. అయినా ఆ సంగతేం గ్రహించనట్లు, "అలాగే బాబు" అన్నాడు, 'పాడుపిల్ల! బాబుగార్ని పుట్టినరోజు పూట పస్తు పెట్టింది' అని ఇందిరను పదిసార్లు మనసులో తిట్టుకొంటూ.

ఇందిర మరునాడు... ఆ మరునాడు కూడా రాలేదు. ఏమయింది? ఇందిర ఎందుకు రావట్లేదు? శ్యాంప్రసాద్‌కి పిచ్చిపట్టినట్టయింది. మనసుకు ఎంతో దగ్గరగా వచ్చిందనుకొన్న ఇందిర ఇలా హఠాత్తుగా రావడం ఎందుకు మానుకొంది? ఏ కారణంగానైనా తనమీద కోపం వచ్చిందా? లేక ఎవరైనా తన గురించి చెడుగా చెప్పి ఉంటారా? ఇంటివాళ్లు కట్టడి చేసారా? ఒంట్లో సుస్తీగా ఉందా? ఇందిర ఎందుకు రాలేదో ఎలా తెలుసుకోడం?

ఇందిర గురించి తనకు తెలిసినదంతా ఆ పిల్ల అందచందాలు, వయోవిలాసాలు, మాటలతో జాలువారే మధుర రాగాలు, నవ్వులతో కలసి పాడే నయగారాలు-

ఈ వివరాలతో ఇందిర గ్రామంలో ఏ యింట, ఎక్కడ వుంటుందో ఎలా తెలుసుకోడం? ఇందిర రూపురేఖలు, హావభావాలు వర్ణిస్తూ యింటియింటికి వెళ్లి అటువంటి అమ్మాయి మీ ఇంట ఉందా? అంటే పిల్లలు పిచ్చివాడనుకొని రాళ్లు రువ్వుతారు, పెద్దలు రౌడీ వెధవ' అని కాళ్లు విరగకొడ్తారు.

ప్రతి రోజూ సాయంకాలం వంతెన ఆ చివరిదాకా వెళ్లి అక్కడ కొంతసేపు గడిపి తిరిగి వచ్చేవాడు శ్యాంప్రసాద్. ఏ దారంటేనా పోతూ ఉంటే ఇందిర కన్పిస్తుందేమోని అతడి ఆశ. ఏ గాలైనా వచ్చి ఇందిర క్షేమం చెవిలో ఊదిపోతుందేమోనని పేరాశ.

అలా ఒక వారం గడిచేసరికి అతడి శ్రమ కొంత ఫలించింది. ఇందిర కన్పించలేదు కాని, మొదటి రోజుల్లో ఆమెతో కలసి వచ్చిన యిద్దరు అమ్మాయిలు కన్పించారు. వడివడిగా అడుగులు వేసి వారిని సమీపించి, "ఆ రోజు మీతో వచ్చిన అమ్మాయి ఇందిర వాళ్ల యిల్లెక్కడ?" అన్నాడు.

"వాళ్లత్తగారిల్లు మా యింటి పక్కనే. కాని ఇందిర లేదు. వెళ్లిపోయింది" అంది ఆ ఇద్దరిలో ఒక అమ్మాయి.

"వెళ్లిపోవడం... అంటే?"

"వాళ్ల ఊరు వెళ్లిపోయింది" అంది రెండో పిల్ల.

అంతకు మించిన వివరాలు వాళ్లకే తెలియవు. యింకా గుచ్చి గుచ్చి అడుగుతే అనవసరమైన వ్యాఖ్యలకి తావిచ్చినట్లవుతుందని మానుకొన్నాడు.

ఏదో కారణంగా ఇందిర వెంటనే ఊరు వెళ్లవలసి వచ్చి వుంటుంది. అందుకే ఆ రోజు పార్టీకి వస్తానని రాలేకపోయి వుంటుంది. ఏ విషయం రేపో మాపో ఉత్తరం రాయకపోదు అనుకొన్నాడు.

ఇందిర నుండి రాబోయే ఉత్తరం కోసం మరికొన్ని రోజులు ఆశతో ఎదురు చూసాడు శ్యాంప్రసాద్.

వారం గడిచింది. పక్షం దాటింది. కేలెండరులో నెల కాగితం చిరిగింది. అయినా ఇందిర జాడ తెలిసిరాలేదు. తెలుస్తుందన్న ఆశ కూడా క్రమంగా సన్నగిల్లి పోయింది.

ఎంతలేసి నెరజాణల్నో తన కొనగోటి చుట్టూ తిప్పుకున్న శ్యాంప్రసాద్ ఈ పడుచుపిల్ల చేతిలో పరాభవం పాలయేడు. అంచులవరకు అమృతం నింపిన పాత్రని నోటి కందిస్తున్నట్లే అందించి అంతలోనే తొలగదీసింది ఇందిర. ఇదొక కొత్త అనుభవం. జీవితంలో యిటువంటి ఆశాభంగాన్ని అతడు అంతకు పూర్వం ఎప్పుడూ చవిచూడలేదు. ఆశించిన వస్తువును పొందలేకపోతే బ్రతుకు ఎంత చేదుగా వుంటుందో మొదటిసారిగా అతడికి అనుభవంలోకి వచ్చింది.

పండులాంటి అతడి జీవితంలో ఇందిర పురుగులా ప్రవేశించి లోపలంతా దొలిచి పోసింది. పైకి పండు పండులాగే నిండుగా కన్పిస్తున్నా, లోపల రసవిహీనమైన పిప్పి మాత్రమే మిగిలింది.

ఎన్నడూ లేనిది జీవితం మీద విరక్తి పుట్టుకొచ్చింది శ్యాంప్రసాద్‌కి. రెండు నెలల క్రిందట అతడిని చూసినవాళ్లు యిప్పుడు తిరిగి చూస్తే పోల్చుకోబడనంతగా మారిపోయాడు. ఉన్నపళంగా పాతికేళ్ల వయసు వచ్చి అతడి మీద విరుచుకుపడింది. సగానికి పైగా తల నెరసిపోయింది. కళ్లల్లో కాంతి సడలింది. కళ్ల కింద చర్మం ముడతలు పడి నల్లని వలయాలు సృష్టించింది. తిండీ-నిద్రా, కట్టూ-బొట్టూ, మాటా-మంతీ అన్నిట్లో ఈ మార్పు కొట్టొచ్చినట్లు కన్పించసాగిది.

కేలెండర్‌లో మరో నెల తిరిగిపోయింది. ఇందిర లేకపోవడం అన్న విషయానికి అతడి మనసు అలవాటు పడసాగింది. రోజూలాగే నాగావళి ఒడ్డున కాస్తసేపు గడిపి రావడానికి బైలుదేరాడు. తిరిగి వస్తుంటే, "ఏమండోయ్" అని ఎవరో పిల్చినట్లు వినిపించింది. ఆ ఊర్లో తనని ప్రత్యేకంగా పిలిచి మాట్లాడే మనుషులు ఎవరున్నారు? ఎవర్నోలే..... అనుకొని వెనుతిరిగి చూడకుండానే ముందుకి అడుగులు వేసాడు.

"చూడుబాబూ! ఆ తాతగార్ని నేను పిలుస్తున్నానని పిలువు"

ఈసారి గొంతుక ఆనమాలు దొరికింది. తటాలున వెనుతిరిగి చూసాడు. పాతిక గజాల దూరంలో ఇందిర పోలికలున్న అమ్మాయి, పోలిక కాదు ఆ పిల్ల ఇందిరే! తనవైపు చూస్తూ చెయ్యి ఊపుతూ పిలుస్తోంది. క్షణకాలం తన కళ్లను తానే నమ్మలేకపోయాడు శ్యాంప్రసాద్. ఉత్సాహంగా అడుగులు వేస్తూ అటు నడిచాడు.

ఇందిర ఒంటరిగా లేదు. పక్కన ఇంకెవరో యువకుదున్నాడు. వాళ్లూ అతన్ని కలుసుకోడానికి ముందుకొచ్చారు.

"మీ ఇంటికెళ్లాం. మీరు పొలంకెళ్లారని రంగయ్య చెప్పాడు. బాగున్నారా?" ఉత్సాహంగా పలకరించింది ఇందిర.

"ఇదిగో బావా! వీరి గురించే ఇంతసేపూ నీతో చెప్పింది. ఈ ఊళ్లో వీరు లేకపోతే ఆ మూడు నెలల్లో నిజంగా నాకు పిచ్చెత్తి ఉండేది" అని శ్యాంప్రసాద్‌ని పరిచయం చేస్తూ, "ఈయన మా బావండీ... కాబోయే శ్రీవారుకూడా. మీ ఊరివారే.... మీకు తెలిసే ఉంటుంది. పై చదువులు పూర్తి చేసుకొని ఈ మధ్యనే అమెరికా నుండి తిరిగి వచ్చారు దొరగారు" అంది ఇందిర ఉత్సాహంతో.

"నమస్కారమండి... నా పేరు శ్రీపతి... అయేందుకు ఈ ఊరివాడినే అయినా చదువు మూలంగా ఎప్పుడూ బైటే వుండడంతో మిమ్మల్ని ఎప్పుడూ కలుసుకొన్న గుర్తులేదు" అన్నాడు ఆ యువకుడు.

పాతికేళ్లకి కొద్దిగా పైబడిన వయసుతో, పొందికైన అవయవ సౌష్టవంతో, యౌవ్వనం రూపు దాల్చి ఎదుట నిలచి మాట్లాడుతున్నట్లు ఉన్న అతడిపక్క ఇందిరను చూసాక ఆ క్షణాన తన వయసు మరో పది సంవత్సరాలు పెరిగినట్లు అనిపించింది శ్యాంప్రసాద్‌కి.

సభ్యత కోసం కొంచెంసేపు ఆగి, "ఎప్పుడైనా మా ఇంటికి రండి" అని మాట వరసకి ఒకసారి ఆహ్వానించి అక్కడి నుండి వెనుతిరిగాడు.

"పాపం... మనిషి మంచివాడిలాగే వున్నాడు. అనవసరంగా అతన్ని మోసం చేసావు నువ్వు" అన్నాడు శ్రీపతి అలా వెళ్లిపోతున్న శ్యాంప్రసాద్ వంక చూస్తూ.

"కథంతా విని మళ్లా మొదటికొస్తావేం బావా! అత్తకి సాయంగా ఉండు' అంటూ ఆజ్ఞ జారీచేసి నాన్న ఇక్కడకు తరిమేరే కాని ఈ పల్లెటూర్లో నాకెలా కాలక్షేపం అవుతుందన్న సంగతి ఆయనకి పట్టలేదు. ఇంట్లో చూస్తే పనీ లేదు... పాటా లేదు, మరి రోజులు గడవడం ఎలా? ఇంతకీ యిందులో ఎవరు ఎవర్నీ మోసం చేసింది లేదు. అతడు తన ఆస్తిపాస్తులు, అంతస్తు, హోదా ఎరగా పెట్టి నన్ను వలలో వెయ్యాలనుకొన్నాడు. నేను, నా అందం, వయసు చూపెట్టి అతడిని బోల్తా కొట్టించాలనుకొన్నాను. అతడి వలలో పడ్డట్టు నేను నటించాను. అతడు నా ఎరకి నిజంగానే తగులుకున్నాడు, అంతే తేడా" అంది ఇందిర నిశ్చలంగా.

"ఏమైనా నువ్వు చేసిన పని మాత్రం నాకు నచ్చలేదు. నీ కాలక్షేపం కోసం పాపం ముసలివాడికి ఆశ చూపించి మోసం చెయ్యడం..."

"పోనీలే... బావా! నీకంత కష్టంగా ఉంటే చెప్పు. అతడినే పెళ్ళి చేసుకొంటానులే... వయసు లేకపోతేనేం? కావలసినంత డబ్బు, దస్కం ఉందిగా.... వెనక్కి పిలిచి చెప్పనా?" అంటూ నోటి పక్కగా చెయ్యి పెట్టి చిన్నగా నవ్వుతూ కేకవెయ్యబోతుంటే... "ఛీ... కొంటె పిల్లా!" అంటూ నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకున్నాడు శ్రీపతి.

కొంచెం దూరం వెళ్లి అప్రయత్నంగా వెనుదిరిగి చూసిన శ్యాంప్రసాద్‌కి ఆ దృశ్యం ఎంతో సహజంగా కనిపించింది. ఇందిర తనతో అంతకాలం ఎంతో సన్నిహితంగా ఉన్నా ఏనాడూ తను చొరవచేసి ఆ విధంగా ప్రవర్తించలేకపోయాడు. వయస్సులో ఉండే మహత్తే అది కాబోలు అనుకొన్నాడు.

ఇల్లు చేరేసరికి ముందు హాలులో రంగయ్య ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు. ఎవరై ఉంటారా? అని ఆలోచిస్తూ అడుగు ముందుకి వేసాడు. ఎదురుగా అరుణ. అనుకోని సమయంలో అనుకోని విధంగా అక్కడ అరుణని చూసి క్షణకాలం తడబడ్డాడు శ్యాంప్రసాద్. తన ముఖంపై ప్రతిఫలిస్తున్న భావాల్ని ఆమె పసికడ్తుందేమో నని కంగారుపడ్డాడు.

తండ్రిని చూస్తూనే ఒక్క ఉదుటున ముందుకొచ్చింది అరుణ.

"అదేమిటి నాన్నా! మరీ ఇంతలా అయిపోయావు! రంగయ్య ఇలాగని ఉత్తరం రాస్తే, ముసలివాడు ఏదో చాదస్తం కొద్ది రాసాడని అనుకొన్నానే కాని..." అరుణ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వాటిని పైటచెంగుతో ఒత్తుకుంటూ, "ఏమైనా సరే నాన్నా! ఈసారి నిన్ను ఒంటరిగా ఇక్కడ వదిలి వెళ్లేది లేదు. నువ్వు నాతో వస్తావా లేక, భర్త, సంసారం, పిల్లలు వదులుకొని నన్ను ఇక్కడ ఉండి పొమ్మంటావో.... నువ్వే చెప్పు" అంది ఆవేశంగా.

"పిచ్చితల్లీ... ఎందుకమ్మా అంత ఆరాటం? నాకు మాత్రం ఒంటరిగా ఈ అడవిలో ఏం తోస్తుంది? నేనూ రావాలనే అనుకొంటూండగా నువ్వే వచ్చావు" అన్నాడు ఆప్యాయంగా కూతురి తల నిమురుతూ.

"పిల్లలేరీ... తీసుకురాలేదా!"

"పాప ఇంటి దగ్గర ఉండిపోయింది. బాబు తోటలో వెంకన్న వెంట తిరుగుతున్నట్లుంది" అంది అరుణ.

ఆమె మాట ఇంకా పూర్తికాక పూర్వమే, "అమ్మా... అమ్మా... తాతయ్యగారి తోటలో ఎన్నో పళ్లు, పువ్వులూ ఉన్నాయి.... అవన్నీ మనూరు తీసుకుపోదామా" అంటూ బాబు ఉత్సాహంగా లోపలికొచ్చాడు.

"తాతయ్యగారి తోటలో పువ్వులూ పళ్ళతో పాటు తాతయ్యని కూడా మన ఊరు తీసుకుపోదాం" అంది అరుణ.

"అవునా తాతయ్యా... నిజంగా మా ఊరు వస్తావా?" అని ప్రశ్నిస్తున్న బాబుని దగ్గరికి తీసుకొని ముద్దు పెట్టుకొంటూ, "రాకపోతే మీ అమ్మ ఊరుకొంటుందా?" అన్నాడు శ్యాంప్రసాద్.

ఇందిర, 'ఆ తాతగార్ని పిలువు' అని ఆ కుర్రాడితో అంటుంటే అతడి మనసు చివుక్కుమంది. నిజానికి కొంచెం కోపం కూడా వచ్చింది. కాని కూతురు, మనవడు "తాతయ్య" అంటుంటే ఆ పిలుపులో ఏదో తీయదనం తోచింది. మరికాస్తసేపు వాళ్లదగ్గర కూర్చుని కబుర్లు చెప్పి, "రంగయ్యా! అమ్మాయికి, బాబుకి ఏం కావాలో చూడు..." అని తన గది వైపు వెళ్లాడు.

గది తలుపు తియ్యబోతూ క్షణకాలం ఆగి వెనుతిరిగి చూసి రంగయ్యని రమ్మని సౌంజ్ఞ చేసాడు. వినయంగా వచ్చి దగ్గర నిల్చాడు రంగయ్య.

"అమ్మాయి వచ్చి ఎంతసేపయింది?" నెమ్మదిగా ప్రశ్నించాడు.

"ఎంతో సేపెక్కడండి? వారి అడుగుల్లోనే మీరు వచ్చారు" అన్నాడు రంగయ్య.

భారం తీరినట్లు నిట్టూర్చి గదిలోకి వెళ్లిపోయాడు శ్యాంప్రసాద్. తలుపు గడియ పెట్టి డ్రస్సింగ్ టేబిల్ మీద రెండు నెలలుగా వాడకుండా వుండిపోయిన లోషన్లు, క్రీములు, హెయిర్ డై వంటి సరంజామా అంతా పదిలంగా తీసి కాగితంలో చుట్టబెట్టి చెత్తబుట్టలో జారవిడిచాడు.

ఎదురుగా ఉన్న అద్దంలో రంగు వెలసి తెల్లబడిన జుట్టుతో, ముడతలు పడిన చర్మంతో ఉన్న తన రూపు చూసుకొని, "హల్లో... తాతయ్యా!" అంటూ తనని తనే పలకరించుకొన్నాడు. అతడి ముఖంపై చిరునవ్వు వెలసింది.

అద్దంలో తాతయ్య కూడా అతడి నవ్వుతో నవ్వు కలిపాడు.

కథా నిలయం
శ్రీకాకుళం